క్లుప్తంగా

ప్రధానోపాధ్యాయిని బాధ్యతల స్వీకరణ


మనోహరి

నారాయణవనం: స్థానిక బాలికల హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయినిగా మనోహరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధితోపాటు ఉత్తమ ఫలితాలు సాధనకు, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపారు.

యోగాతో ఒత్తిడి దూరం


యోగా చేస్తున్న సీఐ నాగార్జునరెడ్డి

శ్రీకాళహస్తి: యోగాతో ఒత్తిడిని దూరం చేయవచ్చని శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్‌తో కలిసి ఆయన యోగా చేశారు. ఈ సందర్భంగా సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ చిన్నారులు నుంచి పెద్దవారి వరకు అందరూ యోగా చేయాలన్నారు. యోగా చేయడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగా శిక్షకురాలు సుజాత, న్యాయవాది రాజేశ్వరరావు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్ కోసం ధర్నా


ధర్నా చేస్తున్న గ్రామస్తులు

నాగలాపురం: బైటకొడియంబేడు సమీపంలో మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని స్థానిక దళితవాడ వాసులు శనివారం ధర్నాకు దిగారు. ఉదయం ఇదే మలుపు వద్ద లారీ ఢీకొని దళితవాడకు చెందిన అర్జున్ (49) అనే వ్యక్తి మృతి చెందడంతో స్థానికులు ఆందోళన చేపట్టారు. గత 20 రోజుల్లోనే ఈ మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేసి, వేగ నియంత్రణ తెలిసేలా సూచిక బోర్డు పెట్టించాలన్నారు.

సన్మానం

శ్రీకాళహస్తి: స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కండక్టర్ సులోచనమ్మ, డ్రైవర్ శ్రీను, పీఆర్ఎంరెడ్డి, గ్యారేజీ మెకానిక్ శేఖర్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. డిపో మేనేజరు మునిచంద్ర, డిపో కార్యదర్శి పసుపులేటి శ్రీనివాస్, కుమార్, జీపీఎస్ ఆచారి, టీఎల్ మూర్తి, కుప్పయ్య, సునీల్‌నాయుడు, గురవమ్మ, కుమార్ పాల్గొన్నారు.

ఈటీసీ ప్రిన్సిపల్ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని కాసాగార్డెన్‌లోని ఈటీసీ ప్రిన్సిపాల్ నాగపద్మజ సేవలు అభినందనీయమని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. శనివారం నాగపద్మజ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా నాగపద్మజ ఘనంగా సన్మానించారు. ముక్కంటి జ్ఞాపికను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీవారి సురేష్, రమేష్, సాయి,ఈటీసీ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంటలో సెక్షన్ 30 అమలు

రేణిగుంట: పోలీస్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ నెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు పోలీస్ చట్టం సెక్షన్ 30 అమలులో ఉంటుందని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. నెల రోజుల పాటు ఎటువంటి సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు లేదా ఊరేగింపులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించకూడదని తెలిపారు. సభలు, సాంస్కృతిక, రాజకీయ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి పూర్తి వివరాలను ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమర్పించి, అనుమతి పొందాలన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే నీటి సమస్య

వరదయ్యపాళెం: ప్రజల దాహార్తిని తీర్చడంలో పంచాయతీ పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు మొలకల బుజ్జమ్మ ఆరోపించారు. గాస్ పైప్‌లైన్ వేస్తున్న కారణంగా ధ్వంసమైన పైపులైన్లకు మరమ్మతు చేయించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. ప్రకాశం వీధి, విజ్ఞాన్‌నగర్, బజార్ వీధి, ట్రంకు రోడ్డు ప్రాంతాల వాసులు నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ మొక్కుబడిగా చేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. గ్యాస్ పైపులైన్ కాంట్రాక్టర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ పంచాయతీ వాసులను ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సర్టిఫికెట్లు.. అంతులేని అగచాట్లు!



• ఈ దంపతుల పేరు లైలా, మారయ్య. సత్యవేడు వాటర్ ట్యాంకు వీధిలో నివసిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వారి కుమారుడి కోసం ధ్రువీకరణ పత్రాలు కావాల్సి వచ్చాయి. ఎవరికి అర్జీ పెట్టుకోవాలో కూడా వారికి తెలియదు. ఈ క్రమంలో వలంటీర్ వారిని కలిసి అవసరమైన పత్రాలను తీసుకున్నారు. 10 రోజుల్లో సర్టిఫికెట్లు అన్నీ తెచ్చిస్తానని చెప్పారు. కేవలం 5 రోజుల్లోనే ధ్రువీకరణ పత్రాలు తీసుకువచ్చి లైలా, మారయ్యకు అందించారు.


శనివారం ఉదయం 11 గంటలకు సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కీళగరం సచివాలయం

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్టిఫికెట్ల కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. సచివాలయానికి వెళితే సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. రెవెన్యూ అధికారులను ఆశ్రయిస్తే.. అదిగో ఇదిగో అంటూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రం వచ్చేదని గుర్తుచేసుకుంటున్నారు. అన్ని పనులను వలంటీర్ పూర్తి చేసి సకాలంలో సర్టిఫికెట్ చేతికందించేవారని వెల్లడిస్తున్నారు. కూటమి పాలనలో అంతులేని అగచాట్లు తప్పడం లేదని వాపోతున్నారు.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సులభతరంగా ధ్రువీకరణ పత్రాలు
- ఇంటికే చేర్చిన వలంటీర్లు
- కూటమి పాలనలో ప్రజలకు తప్పని ప్రదక్షిణలు
- కాళ్లరిగేలా తిరిగినా సకాలంలో అందక అవస్థలు

నారాయణవనం : విద్యా సంవత్సరం ప్రారంభవుతోంది. పిల్లల అడ్మిషన్లకు ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన పరిస్థితి. అయితే కూటమి ప్రభుత్వం నిర్వాకంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. నిత్యం సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సచివాలయానికి వెళ్లినప్పుడు సర్వర్ మొరాయించినా, ఇంటర్నెట్ స్తంభించినా, డిజిటల్ అసిస్టెంట్ కానీ, వీఆర్‌ఓ కానీ అందుబాటులో లేకపోయినా మరుసటి రోజు రావాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు వదులుకుని రెండు మూడు రోజులు తిరిగితే కానీ సర్టిఫికెట్‌కు కనీసం దరఖాస్తు చేసుకోలేని దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. తర్వాత ధ్రువీకరణ పత్రం తీసుకునేందుకు మరో వారం, పదిరోజులు పడుతోందని ఆరోపిస్తున్నారు. అదే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తు తీసుకునేవారని, త్వరితగతిన సర్టిఫికెట్ తీసుకువచ్చి అందించేవారని గుర్తు చేసుకుంటున్నారు. ఇలా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం ఎవరికీ ఉండేది కాదని వెల్లడిస్తున్నారు. ఆదాయ, నివాస, కుల, కుటుంబ, కౌలు రైతు, కుల వృత్తుల, డప్పు కళాకారుల, వివాహ తదితర సర్టిఫికెట్లను గడువు కంటే ముందుగానే చేతికందేవారని వివరిస్తున్నారు.

తిరగాల్సి వస్తోంది



గత ప్రభుత్వంలో సర్టిఫికెట్ తీసుకోవాలన్నా, పని కావాలన్నా వలంటీర్ ద్వారా ఇంటి నుంచే చేసుకుని వాళ్లం. ప్రస్తుతం చిన్న పనికి కూడా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. వలంటీర్ల సేవలను మరువలేం. కూటమి సర్కారు వచ్చిన తర్వాత మా కుమారుడు జనన ధ్రువీకరణ పత్రంలో ఇంటిపేరు మార్చుకోవడానికి రెండు నెలలు తిరిగితే గాని పని చేసుకోలేకపోయా.

– నాదముని, రామకృష్ణాపురం, రేణిగుంట

వ్యవస్థ నిర్వీర్యం



కూటమి ప్రభుత్వం అధికారంతో కక్ష కట్టి సచివాలయ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. ప్రజలకు ఉపయోగపడే పనులకు రాజకీయాలను ముడిపెట్టి అడ్డుకోవడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. వలంటీర్ల ద్వారా ప్రజలకు జరిగిన మేలు విలువ కట్టలేనిది.

– ఇస్మాయిల్, సత్యవేడు

గతంలో ఇబ్బందులు లేవు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అయిదేళ్ల పాటు ఏ పని కోసం ఇబ్బందులు పడలేదు. విద్యార్థులు, రైతులు, దివ్యాంగులు, వితంతువులు, నూతన దంపతులు తమకు కావల్సిన సర్టిఫికెట్లను సులువుగా వలంటీర్ల ద్వారా తీసుకునేవారు. ఒక్కసారి వారికి బాధ్యత అప్పగిస్తే పని పూర్తయిన వెంటనే ఇంటికే తీసుకువచ్చి ధ్రువీకరణ పత్రాలు అందించేవారు.

– కృష్ణయ్య, బీఎన్ కండ్రిగ

పనులు ఆలస్యం



కూటమి ప్రభుత్వంలో అవసరానికి సర్టిఫికెట్ అందుకోలేక పోతున్నాం. గతంలో వలంటీర్లు అన్ని పనులు చేసిపెట్టడంతో సజావుగా ఉండేది. ఇప్పుడు వారు లేకపోవడంతో సర్టిఫికెట్ తీసుకోవాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోంది. సచివాలయంలో సిబ్బంది ఉంటే సర్వర్లు పనిచేయవు. అన్నీ పనిచేస్తే వీఆర్‌ఓలు ఉండరు.

– యుగంధర్, కాదిరివేడు, సత్యవేడు

కక్షగట్టినట్టు కష్టాలు



వలంటీర్లు లేకపోవడంతో సర్టిఫికెట్ కోసం మూడు కిలోమీటర్ల దూరంలో కీళగరం సచివాలయానికి వెళ్లాలి. కూలి చేసుకునే వారు పని వదులుకుని సచివాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. సర్టిఫికెట్ కోసం మూడు, నాలుగు రోజులు తిరిగితే ఇల్లు ఎలా గడుస్తుంది. కూటమి ప్రభుత్వం కక్షగట్టినట్లు కష్టాలు పెడుతోంది.

– ఉమాపతి, వెత్తలతడుకు, నారాయణవనం

• నివాళి


నివాళులర్పిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని పాత వీరాపురంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పాతకుంట రంగారెడ్డి అనారోగ్యంలో మృతి చెందడంతో శనివారం ఆయన మృతదేహం వద్ద మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైఎస్సార్ సీపీ ఏర్పేడు మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, ఉపాధ్యక్షులు మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, దాము, కేశవులు రెడ్డి, గురునాథం, వర్మ, మునిరెడ్డి, హరిదాస్‌రెడ్డి, రామ్‌రెడ్డి, రవి, జమున పాల్గొన్నారు.

నాగేంద్రకు నివాళి

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ నేత అంజూరు వెంకటేష్‌బాబు బావ పోతురాజు నాగేంద్ర అనారోగ్యంతో మరణించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శ్రీకాళహస్తిలోని ఆయన ఇంటికి వెళ్లి నాగేంద్ర మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలిపారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, స్వర్ణ మూర్తి, కొట్టే సత్యనారాయణ, దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు సాధనమున్న రాయల్, పార్టీ యువజన విభాగం నియోజవర్గ అధ్యక్షుడు శ్రీవారి సురేష్, మాజీ కౌన్సిలర్ కంటా ఉదయ్ కుమార్, కొట్టె శరవణ, విజయ్ కుమార్‌రెడ్డి సంతాపం తెలిపారు.

3 నుంచి బంగారమ్మ జాతర

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా బంగారమ్మ కాలనీలో ఉన్న బంగారమ్మ ఆలయంలో జాతర ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. 3వ తేదీ ఉదయం బంగారమ్మకు అభిషేకం, 7 గంటలకు గరిగెపూజ, అంబళ్లు, 10 గంటలకు మైలుముగ్గు, మధ్యాహ్నం పోతురాజు ముగ్గు, సాయంత్రం పొంగళ్లు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 4వ తేదీ ఉదయం ప్రత్యేక అభిషేకం, సాయంత్రం కుంభం, అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనం జరుగుతుందని తెలిపారు.

స్టార్టర్ల చోరీ


పగుల గొట్టిన స్టార్టర్లు

ఏర్పేడు: శ్రీకాళహస్తి మండలం తొండమనాడు, అమ్మపాళెం పొలాల్లోని వ్యవసాయ మోటార్ల స్టార్టర్లు శుక్రవారం రాత్రి చోరీకి గురయ్యాయి. నియోజకవర్గంలో ఇటీవల తరచూ స్టార్టర్లు చోరీలు జరుగుతూనే ఉన్నాయి. వరి నాట్లు ప్రారంభవుతున్న తరుణంలో గుర్తు తెలియని వ్యక్తులు 10 మోటారు, స్టార్టర్లు, వైర్లను చోరీ చేయడంతో సాగునీటికి అవస్థలు తప్పవని బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు తెలిపారు.

పౌర హక్కులపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పల్లమాల ఎస్టీ కాలనీలో శనివారం పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సీలు, ఎస్టీలు పలు సమస్యలను విన్నవించారు. కుకొత్తపాళెం గ్రామంలో ఏపీఐఐసీ సంస్థ తమ భూములను సేకరించి సక్రమంగా పరిహారం చెల్లించలేదని ఆరోపించారు. విద్యార్థుల సౌకర్యార్థం పచ్చాలమ్మ కాలనీ వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఆర్ఐ నల్లయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎస్టీలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఏపీఎం మునెయ్య పాల్గొన్నారు.

ఘనంగా పొగాకు వ్యతిరేక దినోత్సవం


ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

సత్యవేడు: దాసుకుప్పంలో శనివారం ఘనంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ పొగాకు వాడకం ఫ్యాషన్‌గా మొదలై వ్యసనంగా మారుతుందన్నారు. దీంతో ఊపిరితిత్తులు దెబ్బతింటాయని, గుండె జబ్బులు, పక్షవాతం, క్యాన్సర్ బారిన పడే ప్రమాదముందన్నారు. పొగాకు వా డకానికి దూరంగా ఉండాలన్నారు. ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, సూపర్‌వైజర్ వి.నాగజ్యోతి పాల్గొన్నారు.

పొగాకు వాడితే క్యాన్సర్ ముప్పు


బుచ్చినాయుడుకండ్రిగలో వైద్య సిబ్బంది ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ : పొగాకు వాడితే క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుందని వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని సందర్భంగా ర్యాలీ చేశారు. సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం


మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న కోగిల సుబ్రమ్మణ్యం, కార్యవర్గ సభ్యులు

తొట్టంబేడు: మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల నూతన కార్యవర్గ సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తామంతా కష్టపడి పని చేస్తామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగేంద్ర, నాయకులు పెరిమాళ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలి


రైతులతో మాట్లాడుతున్న సీఐ తిమ్మయ్య

తొట్టంబేడు: వ్యవసాయ భూముల్లో విద్యుత్ మోటార్లు, స్టార్టర్ల చోరీని నియంత్రించేందుకు రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య తెలిపారు. తొట్టంబేడు మండలంలోని చోడవరం, చేమూరు, పిల్లమేడు, కొత్తకండ్రిగ, పెద్దకనపర్తి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. రైతులకు చోరీల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఓ గుర్తు తెలియని దొంగల ముఠా వ్యవసాయ భూముల్లోని మోటార్లు, స్టార్టర్లను చోరీ చేస్తుందని చెప్పారు. రైతులు తమ పరికరాలను పరిరక్షించుకునేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

వేడుకగా ఊంజల్ సేవ

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం తిరుచ్చి వాహనంపై దేవదేవేరులను కొలువుదీర్చి ఊరేగించారు.

ఉగ్రవాదం, మతోన్మాదం వేర్వేరు కాదు


నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

శ్రీకాళహస్తి : ఉగ్రవాదం, మతోన్మాదం వేర్వేరు కాదని, ఆ రెండింటితో దేశానికి ముప్పు ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. ఉగ్రవాదం, మతోన్మాదాన్ని అంతమొందించడంలో మోదీ సర్కార్ విఫలమైందని ధ్వజమెత్తారు. ఇండియా బ్లాక్, వామపక్ష పార్టీలు, క్రిస్టియన్, ముస్లిం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం పట్టణ నాలుగు మాడ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఉగ్ర మూకల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టిన మోదీ సర్కార్ ట్రంప్‌నకు తలొగ్గి అర్థాంతరంగా ముగించిందని మండిపడ్డారు. 140 కోట్ల మంది భారతీయల మనోభావాల్ని ట్రంప్ వద్ద తాకట్టు పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య సమరంలో బ్రిటీషర్లకు సలాం కొట్టి పారిపోయిన కాషాయి వాదులు ఉగ్ర మూకల ఏరివేతలోనూ అదే పంథా అవలంబించారని ఎద్దేవా చేశారు. దేశం కోసం పోరాడుతున్న కల్నల్ సోఫియా ఖురేషీపై సైతం కాషాయి వాదులు మత ఆరోపణలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దేశ సమగ్రతను కాపాడటంలో సమైక్యతావాదులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర రెడ్డి, పాస్టర్ సుందర్ రాజు, పాస్టర్ ఆంబ్రోస్, పాస్టర్ కొండయ్య, పాస్టర్ భాస్కర్, లాల్ బాషా, అన్వర్ బాషా, మీర్జాన్ బాషా, మీర్జావలి, రఫీ, సీపీఎం నేతలు గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్, వేణు, గురునాధం, ఈశ్వరయ్య, సంక్రాంతి వెంకటయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడిపై అవగాహన


డ్రోన్‌లపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు, పార్లపల్లి, పల్లమాలలోని రైతు సేవా కేంద్రాల వద్ద శనివారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం తిరుపతి వారి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కింద అధిక దిగుబడి సాధించడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల నిపుణుడు సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. శాస్త్రవేత్త సుకుంత్ మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యత, జీవన ఎరువులు, భూమి ఆరోగ్యంతో ప్రయోజనాలను తెలిపారు. ఏఓ భారతి మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పలు పథకాలను ప్రవేశ పెట్టిందని వెల్లడించారు. రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రాయితీపై ప్రభుత్వం డ్రోన్‌లు అందిస్తోందని, వాటి పనితీరును వివరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి శారద, పశువైద్యాధికారి అశ్విని పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌ను ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థుల కోసం పాఠ్య పుస్తకాలు 14,806, నోట్ పుస్తకాలు 16,210 పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, సీఆర్‌పీలు ప్రసూన, ఈశ్వరమ్మ, కృష్ణయ్య, లీలాప్రసాద్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 రేషన్ దుకాణాలను ఆర్ఐ నల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీదేవి మాట్లాడుతూ ఒకటో తేదీ నుంచి 15 వరకు రేషన్ పంపిణీకి డీలర్లు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. దివ్యాంగులు, 65 ఏళ్లు దాటిన వృద్ధుల ఇంటికే వెళ్లి సరుకులు అందించాలని స్పష్టం చేశారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేయాలని కోరారు.

సెల్‌ఫోన్ చోరీ


చోరీ చేసిన మహిళ

రేణిగుంట: పట్టణంలోని ప్రొవిజన్స్ హోల్‌సేల్ షాపులో రూ.50 వేల విలువ చేసే సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని మహిళ చోరీ చేసిన సంఘటన చోటు చేసుకుంది. షాపు యజమాని శ్రీనివాసులు కథనం మేరకు.. రేణిగుంటలోని షాపులో ఒక మహిళ, మరో వ్యక్తి శనివారం రాత్రి 6.45 గంటలకు సామగ్రి కొనుగోలు చేస్తూ టేబుల్ పైన ఉన్న సెల్‌ఫోన్ అపహరించుకుని వెళ్లారు. కొంత సమయానికి సెల్‌ఫోన్ చోరీ జరిగినట్లు గుర్తించిన య జమాని సీసీ టీవీ ఫుటేజీను పరిశీలించారు. మహిళ సెల్ ఫోన్ దొంగిలించినట్లు గుర్తించడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాద స్థలంలో గాయాలతో పడి ఉన్న మణికంఠ

రేణిగుంట: స్థానిక ఓల్డ్ చెక్ పోస్ట్ సమీపంలో పుత్తూరు రహదారిపై ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. రేణిగుంట మండలంలోని కృష్ణాపురం హరిజనవాడకు చెందిన మణికంఠ, గురవరాజుపల్లి ఎస్టీ కాలనీ చెందిన వాసు శనివారం రాత్రి ద్విచక్ర వాహనాలపై ఎదురెదురుగా వచ్చి ఢీ కొన్నారు. వారిద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

రేపటి నుంచి రైతు సమావేశాలు

నారాయణవనం: మండలంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కింద రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి శోభారాణి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ కేంద్ర రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, వ్యవసాయ పరిశోధనా మండలి, రాస్ కృషి విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పంటల యాజమాన్య పద్ధతులు, అధిక దిగుబడికి సూచనలు, భూసార పరీక్ష ప్రాముఖ్యత, వ్యవసాయ, అనుబంధ రంగాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డ్రోన్ల ఉపయోగాలపై రైతులకు సూచనలు అందించనున్నట్లు వివరించారు. ఈ మేరకు సోమవారం గోవిందప్ప నాయుడు కండ్రిగ, నైనారుకండ్రిగ, మంగళవారం నారాయణవనం, కీళగరం, భీమునిచెరువులో సమావేశాలు ఉంటాయని తెలిపారు.